సమాచారం

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా కిలో రూ.23, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 55, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 35, పందిరిబీర 45, క్యాబేజీ 9, క్యారెట్ 15, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 40, గోకరకాయ 45, కీర 25, దోసకాయ 28, బీట్‌రూట్ 16, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 19, చామగడ్డ 70, మొరంగడ్డ 23, కందగడ్డ 33, సొరకాయ 13(ఒకటి), పొట్లకాయ 18(ఒకటి), అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4-6 (ఒకటి), ముల్లంగి 3-5(ఒకటి). ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు ఉంటాయి.

బీజేపీ మీడియా జాయింట్ కన్వీనర్‌గా శ్రీనివాస్

పద్మారావునగర్: మహంకాళి జిల్లా బీజేపీ మీడియా జాయింట్ కన్వీనర్‌గా వై.శ్రీనివాస్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం సమన్వయకర్త టి. రాజశేఖరరెడ్డిలు కలిసి శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

క్లుప్తంగా...

ఖబ్రస్తాన్‌లో సౌకర్యాలు కల్పించాలి

లాలాపేట:ఖబ్రస్తాన్ కమిటీ సభ్యులు బుధవారం తార్నాకలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ముస్లిం శ్మశాన వాటికల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి, స్థానిక బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆస్పత్రి సేవలు అభినందనీయం

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని మహ్మద్‌గూడ రెడ్‌క్రాస్ ఆస్పత్రి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కార్పొరేటర్ సామల హేమ అన్నారు. డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సక్కుబాయితో కలిసి బుధవారం ఆస్పత్రిని సందర్శించి రోగులతో మాట్లాడి అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వసతులు, సౌకర్యాలతోపాటు హాజరు పుస్తకాన్ని పరిశీలించారు.

ఓయూలో ముగిసిన సాంస్కృతిక పోటీలు



బృందగీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నిర్వహించిన అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ కళా రూపాలను ప్రదర్శించి అబ్బురపరిచారు. క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో రెండు రోజులపాటు జరిగిన సాంస్కృతిక పోటీలు బుధవారం ముగిశాయి. వారం తరువాత ఫలితాలను ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.

సారంగపాణికి పలువురి జన్మదిన శుభాకాంక్షలు



చిలకలగూడ : సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి జన్మదిన వేడుకలు నామాలగుండు బీఎస్ఆర్ ఫంక్షన్‌హాలులో బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇంచార్జి రాజశేఖర్ రెడ్డి, సీకే శంకర్, పెద్ది రవీందర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, ప్రముఖులు, పలు సంఘాల ప్రతినిధులు, ఆశావర్కర్లు సమక్షంలో వేడుకలు జరుపుకున్నారు. అనంతరం మధురానగర్ కాలనీ ఎస్ఆర్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ బిస్కెట్లు పంపిణీ చేశారు.

ఈనెల 26న పర్యావరణంపై చిత్రలేఖనం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈనెల 26 ఆదివారం ఉదయం 10.30 గంటలకు నాంపల్లి పబ్లిక్ గార్డెన్ బాలభవన్‌లో పర్యావరణం అనే అంశంపై చిత్రలేఖనం ఉంటుందని ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ సలహా దారులు కె.వి.రమణాచారి, డీఎఫ్ఓ కొండా మోహన్, సీనియర్ పాత్రికేయులు బి.వి.ప్రసాద్‌లు హాజరవుతారని నిర్వాహక సంస్థ నాయకులు ఉప్పల వెంకటేష్‌గుప్తా, ఎస్.హెచ్. రంగయ్యలు తెలిపారు.

సినీ పరిశ్రమ అభివృద్ధికి సహకారం

మంత్రి తలసాని

సనత్‌నగర్: చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వ సహకారం ఎప్పటికీ ఉంటుందని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖామంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నగరంలోని ప్రముఖ సాంస్కృతిక కళా సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో వెస్ట్‌మారేడ్‌పల్లిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రముఖ సినీదర్శకుడు కే.విశ్వనాథ్ 93వ జయంతి సందర్భంగా సప్తపది చిత్ర కథానాయిక సబితను మంత్రి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కే విశ్వనాథ్ తెలుగు చలనచిత్ర పరిశ్రమను మహోన్నత శిఖరాలకు చేర్చిన మహనీయుడు అన్నారు. తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ కూర్మాచలం తదితరులు పాల్గొన్నారు.



సబితను సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

దాతల హకారంతో ఆలయ అభివృద్ధి

అమీర్‌పేట: దాతలు, ప్రభుత్వ సహకారంతో ఆలయాలను మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేట హనుమాన్ దేవాలయం ఎదుట దాతల సహకారంతో నూతనంగా నిర్మించనున్న రేకుల షెడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. భక్తులు అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ పాల్గొన్నారు.



షెడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

రోబోటిక్ చికిత్సతో తుంటి సమస్యకు చెక్

డాక్టర్ గురువారెడ్డి

రాంగోపాల్‌పేట్: కోవిడ్ వ్యాధిబారిన పడి కోలుకున్న తర్వాత 40 నుంచి 50 శాతం మందిలో అవాస్కులర్ నెక్రోసిస్ అనే (ఏవీఎన్) తుంటి సమస్య కనిపిస్తోందని కనిపిస్తుందని ప్రముఖ కీళ్ల మార్పిడి సర్జన్ డాక్టర్ గురువారెడ్డి అన్నారు. బుధవారం సికింద్రాబాద్ కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో నెలలో ఇలాంటి 10 కేసులు వచ్చేవని కానీ కోవిడ్ తర్వాత వారానికి 10 కేసులు కనిపిస్తుండటం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. ఇది ఎక్కువగా 22 వయసు నుంచి 35 ఏళ్ల వయసులో ఉండేవారిలో కనిపిస్తోందన్నారు. తుంటిలోని కార్టిలేజ్‌కు రక్తం సరఫరా కాకపోవడంతో ఈ సమస్య తలెత్తుతుందన్నారు. రోబోటిక్ టెక్నాలజీతో ఈ సమస్య పరిష్కరించవచ్చన్నారు.



శస్త్ర చికిత్స చేయించుకున్న షేక్ ఇస్మాయిల్‌తో డాక్టర్ గురువారెడ్డి బృందం

రోబోటిక్ శస్త్ర చికిత్సతో తుంటి కీలులోని కప్పులో బంతిని కూర్చొబెట్టే విధానం ఖచ్చితంగా ఉంటుందన్నారు. 2020 నుంచి ఈ ఆధునిక రోబోటిక్ ద్వారా 4వేల శస్త్ర చికిత్సలు పూర్తి చేశామని వివరించారు. రోబోటిక్‌తో తుంటి మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్న 31 ఏళ్ల షేక్ ఇస్మాయిల్ తన అనుభవాన్ని వివరించారు.

ఎక్కడికక్కడ దోచుకోవడమే మంత్రి తీరు

తలసానిపై మర్రి శశిధర్‌రెడ్డి ధ్వజం

సనత్‌నగర్: ఏ పని చేసినా కమీషన్ల కోసమే పాకులాడుతున్నారంటూ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి ఆరోపణలు గుప్పించారు. ఎక్కడికక్కడ దోచుకోవాలనే తీరుతో ముందుకుసాగుతున్నారని దుయ్యబట్టారు. బుధవారం సాయంత్రం బాపునగర్‌లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సభలో ఆయన మాట్లాడుతూ.. బాపునగర్ బస్తీ కమ్యూనిటీ హాల్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని 1962లో హౌసింగ్‌బోర్డు స్వాధీనం చేసుకుందన్నారు. అయితే కొంతమంది వ్యక్తులు తప్పుడు డాక్యుమెంట్లతో మోసపూరితంగా ఆక్రమించుకున్నారన్నారు. ఇక్కడి స్థలంపై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి తలసాని శ్రీనివాస్‌యాదవ్ లేఖ రాసి పూర్తి నివేదిక పంపించాల్సిందిగా కోరారని, కానీ ఆ నివేదిక గురించి ఆ తర్వాత ప్రస్తావన లేదన్నారు. కార్యక్రమంలో అమీర్‌పేట కార్పొరేటర్ సరళతో పాటు నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

వాహనదారుణ్ణి చితకబాదిన ట్రాఫిక్ కానిస్టేబుల్

దూషిస్తావేమిటని ప్రశ్నించిన పాపానికి దౌర్జన్యం



బాధితుడు శేఖర్

సనత్‌నగర్: తనను ఎందుకు దుర్భాషలాడారంటూ ఓ వాహనదారుడు ప్రశ్నించిన పాపానికి ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ తన ప్రతాపం చూపించాడు. వీడియో ద్వారా సోషల్ మీడియాలో తన ఆవేదనను వెలిబుచ్చడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఖమ్మం జిల్లాకు చెందిన శేఖర్ (32) తన బైక్‌పై కానిస్టేబుల్ సెలక్షన్స్‌కు హాజరై తిరిగి రహ్మత్‌నగర్ వైపునకు వెళ్తున్నారు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ గోపీనాథ్ అకారణంగా శేఖర్‌ను దూషించాడు. దూషిస్తావేమిటని శేఖర్ ఆ ట్రాఫిక్ కానిస్టేబుల్ గోపీనాథ్‌ను ప్రశ్నించాడు. దీంతో కానిస్టేబుల్ ఆగ్రహావేశానికి లోనై పోలీసు వాహనాన్ని రప్పించి శేఖర్‌ను రహ్మత్‌నగర్ పోలీసు ఔట్‌పోస్టుకు తరలించారు. అక్కడ బెల్ట్‌తో శేఖర్‌ను చితకబాదారు. బాధితుడి కంట్లో పిడికిలితో కొట్టడంతో కంటికి గాయమైంది. బూటు కాళ్లతో తన్ని బెల్టుతో కొట్టారంటూ బాధితుడు వీడియోలో ఆవేదన వెలిబుచ్చారు. తన బైక్ ఇవ్వాలని అడగ్గా..అంతు చూస్తామంటూ బెదిరిస్తున్నారని శేఖర్ వాపోయారు. గాయాలు నయం అయ్యాక వస్తే బైక్ ఇస్తామని చెబుతున్నారని, సీపీ ఆనంద్ తనకు న్యాయం చేయాలని, లేకుంటే చావే శరణ్యమని రోదించాడు.

సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారం



అధికారులతో సమన్వయ సమీక్ష నిర్వహిస్తున్న జెడ్‌సీ శ్రీనివాస రెడ్డి

చిలకలగూడ : అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తే ప్రజా సమస్యల పరిష్కారం మరింత సులభం అవుతుందని జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో బుధవారం వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు మరింత ఉత్తమమైన పాలన అందించేందుకు ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు. జీహెచ్ఎంసీ, రైల్వే, పోలీస్, ట్రాఫిక్, జలమండలి, విద్యుత్, ఆర్టీసీ తదితర విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ చేస్తున్న దాడులకు మేం భయపడం

ముషీరాబాద్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ముషీరాబాద్ నియోజకవర్గ నాయకులు నాగేష్‌ముదిరాజ్ తెలిపారు. బుధవారం రేవంత్‌రెడ్డి పాదయాత్రకు సంఘీభావంగా వరంగల్ జిల్లా భూపాలపల్లి నియోజకవర్గంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు స్వచ్ఛందంగా యాత్రకు సంఘీభావం తెలుపుతున్నారని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి యాత్రను తలపిస్తోందన్నారు. బీఆర్ఎస్ నాయకులు యాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూ.. యూత్ కాంగ్రెస్ నేతలపై దాడులకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఇలాంటి దాడులకు భయపడదన్నారు.

ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు

- బర్త్‌డే వేడుకల కోసం బయటకు వెళ్లిన విద్యార్థినులు
- ఒక రోజు అనంతరం ఫ్రెండ్ ఇంట్లో గుర్తింపు

రసూల్‌పురా: పుట్టినరోజు వేడుకలు జరుపుకునేందుకు బయటికి వెళ్ళిన ముగ్గురు విద్యార్థినుల ఆచూకి ఎట్టకేలకు లభించింది. దీంతో భయాందోళనకు గురైన తల్లిదండ్రులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన తిరుమలగిరి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన మేరకు తిరుమలగిరిలో 9,10, ఇంటర్ చదివే విద్యార్థినులు ముగ్గురు పక్కపక్కనే నివాసం ఉంటున్నారు. వారిలో ఓ విద్యార్థిని పుట్టినరోజు కావడంతో మంగళవారం వేడుకలు సరదాగా బయట జరుపుకుందామని వెళ్ళారు. ఒక్కరోజు గడచినా ఇంటికి తిరిగి రాకపోవ డంతో తండ్రి సురేష్ బుధవారం తిరుమలగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విద్యార్థినుల సెల్‌ఫోన్లు కూడా ఆఫ్‌అయ్యాయి. మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో సెల్‌ఫోన్ ఆన్ కావడంతో ఉప్పల్ లోకేషన్ కనిపించింది. వారికి ఫోన్‌చేయగా ఉప్పల్‌లో సహచర విద్యార్థి ఇంట్లో ఉన్నామని ఇంటికి బయలు దేరుతు న్నామని చెప్పారు.

యువతిని కుటుంబసభ్యులకు అప్పగించిన పోలీసులు



యువతిని ఆమె కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న జీఆర్పీ పోలీసులు

అడ్డగుట్ట: మతిస్థిమితం సరిగాలేని యువతి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తిరుగుతుండగా జీఆర్పీ పోలీసులు చేరదీసి కుటుంబసభ్యులకు అప్పగించారు. జీఆర్పీ పోలీసులు తెలిపిన కథనం ప్రకారం. బెంగుళూరుకు చెందిన కవిత(30)కు మతిస్థిమితం సరిగాలేదు. ఈ నెల 22న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తిరుగుతోంది. గమనించిన రైల్వే పోలీసులు సదరు యువతి వద్దకు వెళ్లి విచారించి ఆమె బంధువులకు సమాచారం అందజేశారు. రైల్వే స్టేషన్‌కు వచ్చిన ఆమె తండ్రి కృష్ణాజీకి ఆమెను అప్పగించారు.

స్టూడియో ముసుగులో స్పా, మసాజ్ సెంటర్ నిర్వహణ

సనత్‌నగర్: స్టూడియో ముసుగులో స్పా, మసాజ్ సెంటర్లను నిర్వహిస్తున్న ఓ వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన మేరకు.. అమీర్‌పేటకు చెందిన ఎస్.అనిల్‌కుమార్ (31) అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని కృష్ణారెడ్డి బిల్డింగ్స్‌లో ఓషన్ బ్యూటీ స్టూడియో నిర్వహిస్తున్నాడు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం స్టూడియోపై దాడులు నిర్వహించగా అక్కడ స్పా, మసాజ్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ కేంద్రానికి ఎటువంటి అనుమతులు, ట్రేడ్ లైసెన్స్ లేకపోగా, కస్టమర్ల రిజిస్టర్ నిర్వహించకపోవడం, సీసీ కెమెరాల ఏర్పాటు లేకపోవడం, అర్హులైన థెరపిస్ట్ లేకపోవడం తదితర సమస్యలను గుర్తించారు. స్టూడియోను మూసివేసి నిర్వాహకులు అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు.

ఓయూలో సంతకాల సేకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల్లో కనీస వేతన చట్టం కోసం ఇచ్చిన జీవో.60ని అమలు చేయాలని బుధవారం సీఐటీయూ నాయకులు ఓయూలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఓయూలో నిర్వహించిన సంతకాల సేకరణలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని సంతకాలు చేశారు. అనంతరం వీసీ, రిజిస్ట్రార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నారాయణ, మహేందర్, సీతారాం, శ్రీధర్‌రావు, బాలకృష్ణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సంతకాలు చేస్తున్న ఉద్యోగులు

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పద్మారావునగర్: సికింద్రాబాద్ బోయిగూడ రైల్వే బ్రిడ్జి సమీపంలో ఉన్న సాయిబాబా దేవాలయంలో బుధవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చనలు, అభిషేకాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయాన్ని పువ్వులతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నర్సింగ్ యాదవ్, మహేష్, కరుణాకర్(పాండు), శ్రీకాంత్, క్రాంతి పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ బాధ్యత వహించాలి

మియాపూర్: అంబర్‌పేట కుక్కల దాడి సంఘటనలో బాలుని మరణానికి జీహెచ్ఎంసీ అధికారులే బాధ్యత వహించాలని, వీధి కుక్కలను దూరంగా తరలించాలని ఏఐఎఫ్‌డీవై గ్రేటర్ హైదరాబాద్ కన్వీనింగ్ కమిటీ సభ్యులు శరీష్ డిమాండ్ చేశారు. బుధవారం స్టాలిన్‌నగర్ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... కుక్కల శస్త్ర చికిత్స కోసం సంవత్సరానికి రూ.15కోట్లు చొప్పున ఖర్చు చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నా వీధి కుక్కల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నా ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. రోడ్లపైన, వీధుల్లో కుక్కలు గుంపులుగా తిరగడంతో ప్రజలు, పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారని, కొన్ని ప్రాంతాలలో గాయాలపాలవుతున్నారన్నారు. బాధిత కుటుంబానికి జీహెచ్ఎంసీ అధికారులు రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

'రైల్వే ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి'

అడ్డగుట్ట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారతీయ రైల్వేలను ప్రైవేటీకరణ చేసే ఆలోచనలను విరమించుకోవాలని హైదరాబాద్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ..రైల్వేను ఆదానీ, అంబానీల వంటి కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టే ప్రయత్నాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. రైల్వేలు ప్రైవేటుపరం కావడం వల్ల ఉద్యోగులతోపాటు సామాన్య ప్రజలపై తీవ్రమైన భారం పడుతుందన్నారు. అనంతరంస్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు సత్యానారాయణ, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

'15న హైదరాబాద్ ముట్టడి'



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బౌద్ధనగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతపై బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మార్చి 15న హైదరాబాద్‌ను నలువైపులా ముట్టడిస్తున్నామని ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ అన్నారు. బుధవారం పార్సిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో ఎంఎస్‌పి, ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎఫ్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మార్చి 15న జరిగే హైదరాబాద్ ముట్టడి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మాదిగ సంగ్రామ యాత్ర పేరుతో అన్ని నియోజకవర్గాలలో పాదయాత్ర చేస్తామన్నారు. ఈ యాత్రలు ఈ నెల 25 నుండి చేపడతామన్నారు. ఎంఎస్పీ నాయకులు శామ్యూల్, మల్లికార్జున్, బాలకృష్ణ, రాజశేఖర్, సీతారం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్ మ్యాచ్

రసూల్‌పురా: తిరుమలగిరి ఫుట్‌బాల్ మైదానంలో కార్డీనల్ డాక్టర్ పూలా అంథోనీ ప్రైజ్‌మనీ ఒకటవ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో బుధవారం మ్యాచ్ ఉత్సాహంగా జరిగింది. బోయినపల్లి రీడ్స్ ఫుట్‌బాల్ అకాడమీ , ఫ్రెండ్స్ యునైటెడ్ క్లబ్ జేజేనగర్ జట్ల మధ్య ఈ మ్యాచ్‌జరిగింది. జేజేనగర్ జట్టు నాలుగు గోల్స్ సాధించగా రీడ్స్ జట్టు ఐదు గోల్స్ సాధించి విజయం సాధించింది. ముఖ్యఅతిథిగా హాజరైన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ విజేతను అభినందించి నగేష్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందజేశారు. టీపీసీసీ జాయింట్ సెక్రటరీ బి. ఆరోగ్యయ్య, యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి మైకెల్ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.



నాగేష్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అందజేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్

ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభించిన ఈటల

రాంగోపాల్‌పేట్: నేడు ప్రభుత్వ ఉద్యోగాలు అందని ద్రాక్షలా మారాయని.. అవి కేవలం 3 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ సేవా సమితి, గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ, లాస్య ఇన్ఫోటెక్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. గ్రూప్ 4 అభ్యర్థులకు ఈ శిక్షణఇస్తారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. నిరంతరం ఆకాశమే హద్దుగా ప్రయత్నం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ సేవా సమితి అధ్యక్షులు పిట్ల నగేష్ ముదిరాజ్, లాస్య ఇన్ఫోటెక్ ఎండీ ఓరుకంటి వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంలో విద్యార్థులు తమవంతు బాధ్యతను పోషించాలని బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. బేగంపేటలోని హీరో ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో గీతాంజలి ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు సేఫ్టీపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు పలు సూచనలు చేసి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అలాగే విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

బన్సీలాల్‌పేట్: ప్రజావ్యతిరేక బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించడానికి కార్యకర్తలు శ్రమించాలని బీజేపీ నాయకులు సూచించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్‌లో జరిగిన ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీజేపీ నాయకులు హరినాథ్ నాయి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, సమన్వయకర్త రాజశేఖరరెడ్డి, గుండు క్రిష్ణ, రాజు, క్రిష్ణ తదితరులు మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తూ కుటుంబ పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి

క్రైం కార్నర్..

రైలులోంచి జారిపడి వ్యక్తి మృతి



అడ్డగుట్ట: ఓ గుర్తుతెలియని వ్యక్తి రైలులోంచి జారిపడి మృతి చెందాడు. ఈ ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. జేమ్స్ స్ట్రీట్ - సంజీవయ్య పార్క్ మార్గమధ్యలోని పట్టాలపై సుమారు 50-55 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు రైలులోంచి జారిపడ్డాడు. ఈ క్రమంలో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

మహిళ అదృశ్యం



భవాని (ఫైల్)

అడ్డగుట్ట: తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన మేరకు.. అడ్డగుట్ట డి.సెక్షన్‌కు చెందిన భవాని(38)కి జగద్గిరిగుట్టకు చెందిన మల్లేష్‌తో వివాహం జరిగింది. అయితే, భర్త వేధింపులు తట్టుకోలేక భవాని ఇటీవల అడ్డగుట్టలోని తన తల్లి ఇంటికి వచ్చింది. ఇళ్లలో పని చేసుకుంటూ తల్లితోనే ఉంటుంది. ఈ నెల 16న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన భవాని తిరిగిరాలేదు. దీంతో ఆమె తల్లి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి..



అడ్డగుట్ట: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నెం. 8లో బుధవారం మధ్యాహ్నం సుమారు 60 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్యం కారణంగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..



అడ్డగుట్ట: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన మేరకు.. ఈ నెల 17న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లోని ప్లాట్ ఫాం నెం. 8లో సుమారు 70 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వృద్ధుడు అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. రైల్వే పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.